## బ్యూటీ పార్లర్ కోర్సు ఉచిత శిక్షణకు దరఖాస్తులు

తిమ్మాపూర్, నవంబర్ 6: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ఎస్‌బీఐ గ్రామీణాభివృద్ధి సంస్థలో ఉచిత శిక్షణకు ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల14 నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సుకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు హాస్టల్ వసతి కూడా ఉంటుందన్నారు. అభ్యర్థుల వ యస్సు 18–45 ఏండ్లు ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9949448157, 9849411002 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15–21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

PLOT FOR SALE



★ భువనగిరి YTDA అప్రూవ్డ్ ప్లాట్స్ బసవపూర్ రిజర్వాయర్ ఎదురు 160 అడుగుల రోడ్డు ఫేసింగ్‌తో 500 Mtrs to RRR 60% Bank Loan. సంప్ర|| సెల్: 7382143246
NTK-316679

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

# నేడు పెద్దపల్లి జిల్లాకు గులాబీ బాస్

- మంథని, పెద్దపల్లిలో ప్రజా ఆశీర్వాద సభలకు హాజరు
- పెద్దసంఖ్యలో తరలిరానున్న ప్రజలు
- రెండు నియోజకవర్గాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి
- సభా స్థలాలను పరిశీలించిన బీఆర్ఎస్ అభ్యర్థులు దాసరి మనోహర్‌రెడ్డి, పుట్ట మధూకర్
- విజయవంతం చేయాలని శ్రేణులు, ప్రజలకు పిలుపు



మంథనిలో సీఎం కేసీఆర్ ప్రసంగించనున్న సభా వేదిక

పెద్దపల్లి, నవంబర్ 6(నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు మంగళవారం పెద్దపల్లి జిల్లాకు రానున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంథని, పెద్దపల్లిలో పార్టీ అభ్యర్థులు పుట్ట మధూకర్, దాసరి మనోహర్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభలకు హాజరుకానున్నారు. ఒక్కో సభకు సుమారు 50 వేల మంది కదిలి రానుండగా, ఇందుకు అనుగుణంగా సన్నాహకాలు చేశారు. మంథని–గోదావరిఖని ప్రధాన రహదారి వెంట భారత్ పెట్రోల్ పంపు సమీపంలో 12 ఎకరాల స్థలం, పెద్దపల్లి జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. సభా ప్రాంగణాల్లో సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నిలువెత్తు కటౌట్లు పెట్టారు. చుట్టుపక్కల, వచ్చే దారుల్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వేదికలను గులాబీ తోరణాలతో అలంకరించారు. సభాస్థలాల్లో నీడ కోసం షామీయానాలు వేశారు. వచ్చిన వారు కూర్చునేలా కుర్చీలను సిద్ధం చేశారు. తాగునీటి వసతి కల్పించారు. అత్యవసరిస్థితులు ఎదురైతే అవసరం మేరకు అంబులెన్స్‌లో అందుబాటులో ఉంచారు. సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు ప్రముఖులు సభలో పాల్గొననున్న నేపథ్యంలో సభ స్థలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. మంథనిలోని కొత్త ఐవోసీ పెట్రోల్ పంపు ఎదురుగా ఉన్న స్థలంలో, పెద్దపల్లిలోని ఐటీఐ కళాశాల మైదానంలో సీఎం హెలీప్యాడ్‌లను ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఎంపిక చేశారు. కాగా, సీఎం కేసీఆర్ సభలను విజయవంతం చేసేందుకు 15 రోజుల నుంచి బీఆర్ఎస్ అభ్యర్థులు, పార్టీ ముఖ్యనేతలు ఊరూరా సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేశారు. సభలను విజయవంతం చేయాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. సోమవారం సభా స్థలాల్లో పెద్దపల్లి, మంథని బీఆర్ఎస్ అభ్యర్థులు దాసరి మనోహర్ రెడ్డి, పుట్ట మధూకర్ ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక నాయకులకు పలు సూచనలు చేశారు.



పెద్దపల్లి ప్రజా ఆశీర్వాద సభలో ఏర్పాటు చేసిన కుర్చీలు

### సీఎం కేసీఆర్ షెడ్యూల్ ఇలా..

గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి మంచిర్యాల జిల్లాలోని మందమర్రికి హెలికాప్టర్‌లో చేరుకోనున్నారు. అక్కడ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న అనంతరం తిరిగి హెలికాప్టర్‌లో మంథనికి మధ్యాహ్నం 2 గంటలకు చేరుకొని మంథని శివారులోని మంథని–గోదావరిఖని రహదారి వెంట ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. మంథని నుంచి హెలికార్టర్‌లో పెద్దపల్లికి సాయంత్రం 4 గంటలకు చేరుకొని, పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.

# 'బండి' నీ మాటలు నమ్మరు

- నామినేషన్‌కు రాజాసింగ్‌ను తెచ్చుకుని నీస్థాయిని దిగజార్చుకున్నవ్..
- ఇది వరకు ఏం చేశావో.. గెలిస్తే ఏం చేస్తావో చెప్పి ఓటడుగు
- ప్రజలు విధ్వంసం కోరుకోవడం లేదు
- అభివృద్ధిని కోరుకుంటున్నరు
- అహంకారపూరిత మాటలు మానుకో
- బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కి మంత్రి గంగుల హితువు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ) : కరీంనగర్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ నోరు తెరిస్తే హిందూ, ముస్లిం, దారుస్సలాం అంటూ రెచ్చగొట్టే మాటలు మాట్లాడుతున్నాడని, ఆ మాటలు పేలడం లేదని, ప్రజలు నమ్మడం లేదని, ఇప్పటికైనా అహంకార పూరిత మాటలు మానుకొని ప్రజాస్వామ్య పద్ధతిలో ఓట్లు అడుక్కోవాలని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖల మంత్రి, కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ హితువు పలికారు. సోమవారం కరీంనగర్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. బండి సంజయ్ అంటే పెద్ద నాయకుడు అనుకున్నానని, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ఆ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన రాజాసింగ్‌ను తెచ్చుకుని నామినేషన్ వేసి, ఆయన స్థాయిని పూర్తిగా దిగజార్చుకున్నారని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో బండి సంజయ్ ఘోరంగా ఓడిపోవడం ఖాయమని, ఇప్పటి వరకు కనీసం రెండో స్థానంలో ఉంటాడని అనుకున్నామని, నామినేషన్ వేయడానికి రాజాసింగ్‌ను తెచ్చుకోవడంతో ఇప్పుడు ఆయన మూడో స్థానానికి పడిపోయాడని స్పష్టం చేశారు. చుట్టు పక్కల 20 స్థానాల్లో ప్రచారం నిర్వహించి, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలనే ఉద్దేశంతో బండి సంజయ్‌కి ఆయన పార్టీ హెలిక్యాప్టర్ కేటాయించిందని, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయన, అదే స్థాయి నాయకులను రప్పించుకుని నామినేషన్ వేస్తారని అనుకున్నామని, కానీ గోషామహల్‌లో ఓడిపోయే అభ్యర్థిని తెచ్చుకొని, ఆయనతో కలిసి నామినేషన్ వేయడంతోనే ఆయన స్థాయి దిగజారి పోయిందని ఎద్దేవా చేశారు. కరీంనగర్ అసెంబ్లీలో బీజేపీ మూడో స్థానానికి పడిపోయిందని తెలిపారు. బండి సంజయ్ నామినేషన్‌కు వచ్చిన రాజాసింగ్ కరీంనగర్ అభివృద్ధి ఎట్లున్నదో చూశాడని, ఇలాంటి అభివృద్ధి తన నియోజకవర్గమైన గోషామహల్‌లో జరిగిందా? అని ప్రశ్నించారు. ఇలాంటి వాళ్లు చెప్తున్న మాటలు విని ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. రాజాసింగ్ సమర్థుడే అయితే తన పక్క నియోజకవర్గాల్లో ఒక్క సీటన్నా గెలిపించగలడా? అని నిలదీశారు. ప్రజలు శక్తి వంతులని, ఎవరు ఏం చేస్తున్నారో గ్రహిస్తారని, కరీంనగర్ ప్రజలు మరింత విజ్ఞులని వాళ్లు కోరుకునేది అభివృద్ధి మాత్రమేనని స్పష్టం చేశారు. తననో, తమ సీఎం కేసీఆర్‌నో తిడితే ఓట్లు పడవని, ఎంఐఎం, దారుస్సలాం అని తిడితే ఓట్లు రావని హితవుపలికారు. ఎంపీగా నిలబడినప్పుడు ఇదే విధంగా ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టిన బండి సంజయ్ ఇపుడు కూడా అదే దారిలో నడవాలని చూస్తున్నాడని, ప్రశాంతంగా ఉన్న కరీంనగర్‌ను అనవసరంగా తన స్వార్థ రాజకీయాల కోసం బలి చేయవద్దని సూచించారు. ఎంపీగా గెలిచి ఏం చేశావో ప్రజలకు చెప్పి హుందాగా ఓట్లు అడుక్కోవాలి గానీ, అనవసరంగా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేయడం మంచిది కాదన్నారు. బండి మాటలు విని ప్రజలకు బోరుకొట్టిందని, నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. బీజేపీ నాయకులు బీసీ సీఎం అని కొత్త నాటకానికి తెర తీశారని, ఒక బీసీ నాయకుడిగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండినే ఆ పదవి నుంచి తొలగించిన విషయాన్ని మర్చిపోవద్దని సంజయ్‌ని ఉద్దేశించి సూచించారు. బీజేపీ నాయకులు రేషన్ కార్డుల విషయాన్ని ప్రస్తావిస్తున్నారని, రేషన్ కార్డులు ఇవ్వాల్సింది ఎవరో వాళ్లకు తెలియదా? అని ప్రశ్నించారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం కేంద్ర ప్రభుత్వమే రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉంటుందని, తెలంగాణ ఏర్పడినప్పుడు 90 లక్షల రేషన్ కార్డులు అవసరం ఉంటాయని కేసీఆర్ అడిగితే పదేళ్ల కింద కేవలం 54 లక్షల కార్డులు మాత్రమే ఇచ్చారని, రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత తీసుకొని 35.67 లక్షల రేషన్ కార్డులు ఇచ్చిన విషయాన్ని మంత్రి గంగుల కమలాకర్ గుర్తు చేశారు. ఈ కార్డుల భారమంతా ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఇవి కాకుండా 2016లో 31,196, 2017–18లో 19,113, 2018–19లో 1,67,601, 2019–20లో 99,570, 2021–22లో 3,11,025, 2022–23లో 18,979 రేషన్ కార్డులు ఇచ్చి పేద ప్రజలను ఆదుకుంటున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఈ బాధ్యతల నుంచి తప్పుకుంటే రాష్ట్ర ప్రభుత్వం భారమైనా బాధ్యతగా తీసుకున్నదని గుర్తు చేశారు. బండి సంజయ్ ఎంత రెచ్చగొట్టినా యువకులు రెచ్చిపోయే పరిస్థితి కనిపించడం లేదని, బండి సంజయ్ మాటలు ఎలా ఎంటాయో వారికి పూర్తిగా అర్థమైందన్నారు. ప్రజలు విధ్వంసాన్ని కోరుకోవడం లేదని, సమగ్ర అభివృద్ధిని కోరుకుంటున్నారని, వారికి కావాల్సిన పనులు తాము చేసి పెడుతున్నామని, తాము చేసిన పనులు చెప్పే ప్రజల నుంచి ఓట్లు అభ్యర్థిస్తున్నామని తెలిపారు. బీజేపీ నాయకులు చేసిన పనులు చెప్పి ప్రజలకు ముందుకు వెళ్లి ఓట్లు అడగాలని సూచించారు. ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి ప్రశాంతమైన వాతావరణాన్ని చెడగొట్ట వద్దని, అహంకార పూరిత మాట్లాలు మాట్లాడవద్దని బండి సంజయ్‌కి హితువు పలికారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కరీంనగర్ మేయర్ పదవి ముస్లిం మైనార్టీలకు ఇస్తారని బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను మంత్రి ఖండించారు. తమ పార్టీలో నాయకులకు కొదవ లేదని, గత ఎన్నికల్లో తాము 60 కార్పొరేటర్ స్థానాలకు పోటీ చేశామని, ఎంఐఎం తో కలిసి ఉంటున్నామని, భవిష్యత్తులో కూడా ఇలాగే ఉంటామని స్పష్టం చేశారు. తాను 8, 9 తేదీల్లో నామినేషన్ దాఖలు చేస్తానని, గత మూడు ఎన్నికల కంటే మంచి మెజార్టీతో ప్రజలు తనను గెలిపిస్తారనే విశ్వాసం ఉందన్నారు. బండి సంజయ్‌కి మూడో స్థానం ఖాయమైందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నగర మేయర్ వై సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, కరీంనగర్ ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, సింగిల్ విండో చైర్మన్ శ్యాంసుందర్ రెడ్డి, నాయకులు పిల్ల మహేశ్, వాసాల రమేశ్ పాల్గొన్నారు.